క్లుప్తంగా

మాలకొండయ్యకు ఆదిమూలపు సురేష్ నివాళి



మాలకొండయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సురేష్, వెంకయ్య

పొన్నలూరు: పొన్నలూరు మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కంచర్ల మాలకొండయ్య సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న దీంతో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మాలకొండయ్య కుటుంబసభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు గడ్డం మాల్యాద్రి, గడ్డం వేణుబాబు, జ్యేష్ఠ వేణు ఉన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



పాపిరెడ్డిపల్లిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధి పాపిరెడ్డిపల్లిలో సోమవారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇటీవల సీతారాముల ఆలయం నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా సీతారాముల వారి కల్యాణ మహోత్సవం అర్చకులు వేదమంత్రాల నడుమ చీకటి అజయ్‌కుమార్ దంపతులు శ్రీవాణిలు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. చీకటి వెంకటసుబ్బయ్య, మురహరి శ్రీనివాసుల, పోతురాజు మంగయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ



నాప్‌కిన్ పంపిణీ చేస్తున్న చైర్మన్ గఫార్, డీఎల్‌డీఓ, డీఎం

కనిగిరిరూరల్: గుడ్ హెల్ప్ ఫౌండేషన్, ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం శానిటరీ నాప్‌కిన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్, డీఎల్‌డీఓ శ్రీనివాసుల రెడ్డి, డీఎం మహమ్మద్ సయనాబేగంలు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సేవాహిత కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ మండ్రు ప్రవీణ్ కుమార్, మండు రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

వెలిగండ్ల(కనిగిరిరూరల్): మండలంలోని రామగోపాలపురం ప్రాథమిక పాఠశాల (జనరల్) స్కూల్‌కు తాళం వేసి ఉండటంతో సంబంధిత టీచర్‌కు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు ఎంఈఓ–2 దేవిరెడ్డి రామిరెడ్డి తెలిపారు. వివరాల్లోకి రామగోపాలపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సోమవారం ఉదయం 10.20 గంటలకు, 12:15 గంటలకు తనిఖీకి వెళ్లగా తాళం వేసి ఉంది. అయితే ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఆ పాఠశాల టీచర్ ఇద్దరు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో హాజరు వేసి ఉన్నట్లు చెప్పారు. దీంతో ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

పని గంటలకు సమానమైన వేతనం ఇవ్వాలి

కొండపి: పనికి తగిన వేతనం ఇవ్వాలని అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీడీపీఓ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3జీ సిమ్ ల వలన పడుతున్న ఇబ్బందులు గురించి అధికారులకు, ప్రభుత్వానికి చెబుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. పనిచేసే ఫోన్లు, సిమ్ లో ఇస్తే ప్రభుత్వానికి సంబంధించిన అన్ని సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కేజీ మస్తాన్, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు నెట్‌వర్క్ సమస్యతో పనిచేయడం లేదన్నారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్లను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. విజయకుమారి, ఆదిలక్ష్మి, మహేశ్వరి, రజిని, సుజాత, అనురాధ, రిజ్వాన, సీతా, లలిత పాల్గొన్నారు.

చెరువు కట్టకు దారేది..?

- ముళ్లచెట్లు, పిచ్చచెట్లతో కనిపించని దారి
- ఇబ్బందులు పడుతున్న వాకర్లు
- చెత్తా చెదారం వేస్తుండటంతో దుర్గంధం



చెరువు కట్టకు వెళ్లే దారిలో చెత్తా.చెదారంలో తిరుగుతున్న పందులు



చేపలను నిల్వ ఉంచిన నీటిని చెరువు కట్టకు వెళ్లేదారిలో వదులుతున్న దుకాణాదారులు

కొండపి: మండల కేంద్రమైన కొండపి చెరువు కట్ట మీద వెళ్లేందుకు వాకర్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని గురించి పట్టించుకునే వారు లేకపోవడంతో రోజు రోజుకు దారి కుంచించుకుపోతోంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో చెరువుగట్టును వెడల్పు చేసి వాకింగ్ చేసుకునేందుకు వీలుగా చేశారు. వాకింగ్ చేసుకోవడంతో పాటు వాహనాల్లో కొండపి నుంచి కట్టావారిపాలెం వెళ్లేందుకు అనువుగా ఉండేది.

చిల్ల చెట్లు, పిచ్చి చెట్లతో కనిపించని దారి

చెరువు గట్టుపై ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రజలు వాకింగ్ చేయడానికి వ్యాయామం చేయడానికి వెళుతూ ఉంటారు. గత కొంతకాలంగా ముళ్లచెట్లు, పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి దారి కనిపించకుండా ఆక్రమించేశాయి. చెట్లు బాగా పెరగడంతో ఆ ప్రాంతంలో పాముల సంచార భయంతో వాకింగ్ వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. గతంలో చెరువు గట్టుపై ట్రాక్టర్లు ప్రయాణించేవి. ఇప్పుడు చెరువుగట్టు ఎక్కడానికి చెట్లు ఆక్రమించడంతో ద్విచక్ర వాహనదారులు కూడా ప్రయాణించడానికి బెంబేలెత్తుతున్నారు.

చెత్త చెదారం ఆ దారిలోనే..

చెరువుగట్టుకు వెళ్లే దారిలోనే చెత్తాచెదారాన్ని ప్రజలు వేస్తున్నారు. చికెన్ షాపుల వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను కూడా చెరువుకు వెళ్లే దారిలోనే వేస్తున్నారు. చేపల దుకాణదారులు చెరువు కట్టకు వెళ్లే దారిలో ఆదివారం చేపలను అమ్ముతూ ఆ నీటిని చెరువుగట్టుకు వెళ్లే దారిలోనే పోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లాలంటే దుర్వాసనతో ప్రజలు అల్లాడుతున్నారు. ఆరోగ్యం కోసం చెరువుగట్టు మీదకు వెళ్లి వాకింగ్ చేద్దామనుకుంటే ముందుగా దుర్వాసనతోనే అనారోగ్య పాలవుతామని బెంబేలెత్తుతున్నారు.

పేరుకే స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర

ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. అధికారులు ప్రధాన సెంటర్లలో కాకుండా తూతూ మంత్రముగా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ఫొటోలకు ఫోజులివ్వకుండా ఈ ప్రాంతాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని వాకర్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో పెరిగిన చెట్లను తీసి వేయించి కోళ్ల వ్యర్థాలను, చేపల వ్యర్థాలను అక్కడ వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కనిగిరిరూరల్: విద్యుత్ చార్జీల పేరుతో నిలువు దోపిడి చేసే ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ప్రజావేదిక నాయకత్వంలో ఈ నెల 5న ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామరావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల భారం ఉండదని మోసపూరిత హామీలిచ్చిన చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం వేస్తూ మోసం చేస్తోందని దుయ్యబట్టారు. కూటమి సర్కార్ ఎన్నికల హామీలను విస్మరించిందని ఘాటుగా విమర్శించారు. ఆదానీ స్మార్ట్ మీటర్ల ఆపేవరకు పెట్టిన మీటర్లు తొలగించే వరకూ, ట్రూ అఫ్ చార్జీలు విధానాన్ని తొలగించే వరకు దశల వారీగా పోరాటాలు సాగిస్తామన్నారు. అందులో భాగంగానే ఈనెల 5న ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు వినియోగ దారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గులాం హుస్సేన్, పి.మోహన్, ఎస్కే ఖాశింపీరా, గుజ్జుల బాలిరెడ్డి, దాసరి సునీత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



పూజల్లో పాల్గొన్న ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల, నాయకులు

పామూరు: మండలంలోని పాబోలువారిపల్లెలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టామహోత్సవం సోమవారం రుత్వికుల వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ప్రతిష్టామహోత్సవంలో పాల్గొనగా ఆయనతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం దేవస్థాన కమిటీ దద్దాలను సన్మానించింది. జెడ్పీటీసీలు చప్పిడి సుబ్బయ్య, మేకల శ్రీనివాసయాదవ్, గట్లా విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, చీమలదిన్నె వెంగయ్య, షేక్.గయాజ్‌బాషా, జి.ఆదినారాయణ రెడ్డి, కటికల వెంకటరత్నం, జి.శ్రీనివాసయాదవ్, చీమలదిన్నె సురేష్, మట్టే కొండలరావు, జాజుల నాగేశ్వరరావు, పాలుబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



అవగాహన ర్యాలీ చేస్తున్న ఇన్‌చార్జి సీడీపీఓ, సూపర్‌వైజర్, కార్యకర్తలు

పామూరు: పుటిటి పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఇన్‌చార్జి సీడీపీఓ పి.లావణ్య అన్నారు. స్థానిక వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జాతీయ తల్లిపాల వారోత్సవాలను సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీడీపీఓ లావణ్య మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను బిడ్డకు తాగించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉండి చిన్నాచితక వ్యాధులకు పురిటిపిల్లలు దూరంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాలవల్ల అనర్థాలు వివరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌జీఓ షేక్.నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్.రమీజా, టి.రామసుబ్బులు, వీవీ నాగవాణి, షేక్.రూహి, షేక్.మెహరాజ్, గర్భిణులు, బాలింతలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపి: బిడ్డలకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ సుశీలాదేవి అన్నారు. మండలంలోని వెన్నూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తొలుత గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ప్రీస్కూల్‌లో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ సంధ్యారాణి, సూపర్‌వైజర్ విక్టోరియారాణి, ఏఎన్ఎం శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



చాకిరాలలోని రామాలయం

కనిగిరిరూరల్: మండలంలోని చాకిరాలలోని రామాలయంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత రామచంద్ర స్వామి విగ్రహ శిఖర కలశ ప్రతిష్టా, మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ప్రతిష్టా మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. సోమవారం గణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవచనం, మాతృక పూజ, పంచక వ్యప్రాసనం, రక్ష బంధనం, యాగశాల ప్రవేశం, కలిశ స్థాపన, యంత్రలాకు అభిషేకాలు, మంగళ హారతి కార్యక్రమాలు నియమనిష్టలతో జరిగాయి. కేటీఆర్ విద్యాసంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో, రావినూతల రమేష్‌శర్మ ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మర్రిపూడిలో కుండపోత వర్షం



చిమట దళితవాడలో ఇళ్లల్లోకి చేరిన వర్షం నీటిని ఎత్తిపోసుకుంటున్న దృశ్యం



మర్రిపూడి ఒడియరాజుల కాలనీలో నిలిచిన వర్షం నీరు

- ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

మర్రిపూడి: మండలంలో రెండు రోజులుగా కుండపోతవర్షం కురిసింది. దీంతో ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. రహదారుల్లో నీరు ప్రవహించింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చిమట గ్రామంలోని దళితవాడలో సైడ్‌కాలువలు సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరింది. దీంతో బక్కెట్లతో నీరు ఎత్తిపోసుకున్నారు. అలాగే మర్రిపూడి ఒడియరాజుల కాలనీలో, ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ వర్షం నీటితో నిండిపోయాయి. కాకర్లలో లోతట్టు ప్రాంతం అంతా జలమయం అయింది. ప్రధాన రహదారులన్నీ బురదమయమయ్యాయి. దీంతో మండలవాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా మురు గు పెరిగే అవకాశం ఉందని, పారిశుధ్య పనులు చేపట్టాలని, అంటురోగాలు సోకకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కనిగిరిరూరల్: కనిగిరిలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు నిచ్చారు. మహాసభల విజయవంతం కోరుతూ సోమవారం స్థానిక కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేరన్నారు. ఉపాధిహామీ పథకం చట్టాన్ని, ఆహార భద్రతా చట్టాన్ని, విద్యా హక్కు చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నాయకులు పీసీ కేశవరావు, వి.మాలకొండారెడ్డి, జి.శ్రీనివాసులరెడ్డి, పి.నరేంద్ర, కె.ప్రసన్న, కె.శాంతకుమారి, ఎస్కే హాజరత్, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విస్తృత సేవలందించాలి

కనిగిరిరూరల్: రైతు సేవా కేంద్ర సిబ్బంది గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి విస్తృత సేవలందించాలని ఏఓ ఎస్కే జైనులాబ్దిన్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు, వ్యవసాయ శాఖ ద్వారా అందచేసే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, సాగు పంటల వివరాలను క్షుణ్ణంగా వివరించాలన్నారు. ప్రతి పంటను ఈ పంట యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎల్ మాల్యాద్రి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డును సత్కరించిన ఎస్పీ



హోంగార్డు చెన్నయ్యను సత్కరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: కనిగిరి పోలీసు స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ జూలై 31వ తేదీ రిటైరైన గాలంకి చెన్నయ్యను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ సత్కరించారు. చెన్నయ్య కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్లపాటు సుదీర్ఘ కాలం హోంగార్డుగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై శ్రీనివాసరావు, కనిగిరి ఇన్‌స్పెక్టర్ గోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చిర్రికూరపాడు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ

జరుగుమల్లి(సింగరాయకొండ): పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చిర్రికూరపాడు విద్యార్థులు అండర్ 14, 17 విభాగాల్లో ముగ్గురు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి కె.సతీష్, కె.శ్రీకర్, రిషిత్‌పాల్ ప్రతిభచాటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. పాఠశాల సిబ్బంది, పీడీ సుజాత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

284 బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 284 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. రైతులు 906 బేళ్లను వేలానికి తీసుకురాగా 622 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.159, సరాసరి ధర రూ.208.52గా నమోదైంది.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 267 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. 1119 బేళ్లను తీసుకురాగా 852 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.159, సరాసరి ధర రూ.219.86గా నమోదైంది.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

మర్రిపూడి: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్కే ఖాశింపీరా అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యక్షతన సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకలవ్య ఫౌండేషన్ అధ్యక్షులు ఎం శ్రీనివాసులు, డీటీ నాగరాజు, నాగూర్‌వలి, అధికారులు పాల్గొన్నారు.

కొండపి కార్మికులకు 10న వేతనంతో కూడిన సెలవు

ఒంగోలు వన్‌టౌన్: కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలను ఈ నెల 10వ తేదీ నిర్వహిస్తున్నందున ఎన్నికలు జరిగే ప్రాంతంలోని కార్మికులకు ఆ రోజు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని వ్యాపారస్తులను ఆదేశిస్తూ ఒంగోలు సహాయ కార్మిక కమిషనర్ కె.పవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రసాద్‌రావు భౌతికకాయానికి దద్దాల నివాళి



ప్రసాద్‌రావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, నేతలు

కనిగిరిరూరల్: రిటైర్డు ఎంపీడీఓ చీమలమర్రి ప్రసాద్‌రావు భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సోమవారం నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్‌లు పులి శాంతి గోవర్ధన్ రెడ్డి, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు దాసరి పద్మ, సయ్యద్ రిజ్వానా ఖాలక్, దాసరి మురళీ, చింతం శ్రీను, దేవకి రాజీవ్, ఎర్రబల్లి దేవరాజ్, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఒకేరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు జీ ఆదినారాయణరెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, ఎస్కే జిలాని బాషా, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, మూలే మాలకొండారెడ్డి, పలుకూరి భాస్కర్, భూమిరెడ్డి కొండారెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, ఎస్కే కరీం, నాగూర్‌వలి, ఎస్కే ఖాశింవలి, తడికమల్ల వెంకటేశ్వర్లు, ఎస్కే షకీలా, అయిమల్ల నాగమణి, బచ్చు వెంగళరావు గుప్తా, బొర్రాజు రమణయ్య, పీసీపల్లి మండల అధ్యక్షుడు జి. బొర్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, భూతలపల్లి మాలకొండారెడ్డి, సీనియర్ న్యాయవాది మాచవరం సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, దేవకి వెంకటేశ్వర్లు, వై రవీంద్రబాబు తదితరులు నివాళులర్పించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

సీఎస్‌పురం(పామూరు): మూల్యాంకన పుస్తకాల ద్వారా విద్యార్థుల సమగ్ర విశ్లేషణకు అవకాశం ఉంటుందని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పంపిణీచేశారు. ప్రతి విద్యార్థికి ఎన్ని సబ్జెక్టులు ఉంటే అన్ని పుస్తకాలు అందిస్తున్నామని, ఆ పుస్తకాల్లోనే పరీక్షలు రాయించి మూల్యాంకనం చేసి మార్కులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలు క్షుణ్ణంగా పరిశీలించడానికి అసెస్‌మెంట్ బుక్‌లెట్స్ ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు అందించిన స్టూడెంట్స్ కిట్స్‌కి బయోమెట్రిక్ అథెంటికేషన్ వెంటనే వేయించాలని ఎంఈఓలు సూచించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ దీప్తి, ప్రవీణ్, సీఆర్‌పి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మెనూ తప్పక అమలు చేయాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సీఎస్‌పురం(పామూరు): మధ్యాహ్న భోజనంలో విధిగా మెనూ అమలు చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని కోవిలంపాడు ప్రాథమికోన్నత పాఠశాల, శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ ప్లస్ పాఠశాలలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ ప్లస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కుక్‌కు ఆదేశించారు. ఎంఈఓ మాట్లాడుతూ శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ ప్లస్ ఆవరణలో పూర్తయిన కేజీబీవీ టైప్–4 బాలికల హాస్టల్‌ను 10 రోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. బాలికల హాస్టల్‌కు అన్ని వసతుల కల్పన, సామగ్రి సరఫరా పూర్తయిందన్నారు. హెచ్‌ఎం బోడా ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రామన వెంకటేశ్వరరెడ్డి

కనిగిరిరూరల్: ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామన వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఈ నెల 5న చేపట్టనున్న 'రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం' వినూత్న కార్యక్రమంపై ఉద్యోగులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సమస్యల మూలాలు గుర్తించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ మేరకు వీడియో, ఆడియో సందేశాలు ప్రదర్శించారు. యూనియన్ నాయకులు మండ్రు రమేష్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్ చంద్ర, గోపినాథ్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

కనిగిరిరూరల్: స్నేహహస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు సోమవారం అన్నదానం చేశారు. డయాలసిస్ రోగులకు, గర్భిణులు, బాలింతలకు, పేషంట్లకు ఉచితంగా భోజనాన్ని అందచేశారు. ఆచారి, చెన్నారావు, మెకానిక్ శ్రీను, శంకర్, మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల్లో హర్షం

పామూరు: మండలంలోని గ్రామాల్లో ఆదివారం, సోమవారాల్లో కురిసిన మోస్తరు వర్షంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఇటీవల తీవ్రమైన ఎండలు, ఉక్కపోత గురికాగా ఈవర్షం ఊరటనిచ్చింది. ఈవర్షంతో రైతులు పంటలు సాగుకు దుక్కులు సిద్ధం చేసుకునే అవకాశం మెండుగా ఉంది. మరో రెండు వర్షాలు కురిస్తే పంటల సాగుకు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉంది.

హాస్టల్‌లో అధ్వాన మెనూపై ఫిర్యాదు

కనిగిరిరూరల్: పట్టణంలో ఉన్న రెండు ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టళ్లలో విద్యార్థినుల అధ్వాన మెనూ, అపరిశుభ్రత తదితర అంశాలపై కలెక్టర్‌కు, ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై నియోజకవర్గంలోని ఓ మహిళా ఎస్సై హాస్టల్స్‌ను ఆదివారం రాత్రి విజిట్ చేసి వారితో కలిసి భోజనం చేశారు. అలాగే సోమవారం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కూడా హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈమేరకు హాస్టల్‌లో మెరుగైన వసతి, నాణ్యమైన మెనూ ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులపై, వార్డెన్లపై ఎమ్మెల్యే ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సోషల్ వెల్ఫేర్ అధికారి శివనాయక్, ఎస్సై టి.శ్రీరాం తదితరులున్నారు.